సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



బీసీ కులగణన అభినందనీయం

సిరిసిల్లటౌన్: బీసీ కులగణన చేపట్టడం హర్షణీయమని సిరిసిల్ల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ అన్నారు. సోమవారం సంఘ భవనంలో మాట్లాడారు. వెంకటేశం, శ్రీనివాస్ తదితరులున్నారు.



బాధ్యతలు చేపట్టిన డీపీఆర్వో

సిరిసిల్ల: జిల్లా పౌర సంబంధాల అధికారిగా వి. శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆఫీస్ సిబ్బంది పూల మొక్క అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వీరత్వానికి ప్రతీక శివాజీ



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన వ్యక్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ అని వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వేములవాడ రూరల్ మండలం జయవరం, అయ్యోరుపల్లి గ్రామాల్లో శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, వీరత్వానికి ప్రతీకగా నిలిచి, ఓటమి ఎరుగని యోధుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. ఛత్రపతిని యువత ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ సందర్శన



కలెక్టరేట్ సందర్శనలో విద్యార్థినులు

సిరిసిల్ల: అడవి బిడ్డలు వాళ్లు.. ఏనాడు కలెక్టరేట్ చూసిన దాఖలాలు లేవు. ఆ అవసరం కూడా రాలేదు. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా పాలనా కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టరేట్‌గా పిలిచే జిల్లా పాలన కేంద్రంలో ఎన్ని విభాగాలు ఉంటాయి.. ఆ శాఖలు చేసే పనులు ఏమిటీ అడిగి తెలుసుకున్నారు. తంగళ్లపల్లి గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థినులు సోమవారం కలెక్టరేట్‌ను సందర్శించారు. అన్ని శాఖలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమి పూజారిని కలిసి మాట్లాడారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం ప్రదర్శన క్షేత్రాన్ని పరిశీలించి ఫొటోలు దిగారు. కలెక్టరేట్‌ను ఉత్సాహంగా, ఉల్లాసంగా పరిశీలించి సంతోషంగా కళాశాల వైపు వెళ్లారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్/సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని మైనార్టీ విద్యార్థులు విదేశీ విద్య అభ్యసించాలనే వారికి ప్రభుత్వ అందించే ఉపకార వేతనం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎండీ సర్వర్‌మియా సోమవారం తెలిపారు. చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ పథకంలో విదేశీ విశ్వవిద్యాలయాల్లో పీజీ, డాక్టరేట్ కోర్సుల విద్య అభ్యసిస్తూ ఉపకారం వేతనం అందుకునేందుకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు-2023 నుంచి డిసెంబర్ 2023 వరకు ప్రవేశాలు పొందినవారు అధికారిక వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 20 వరకు అవకాశం ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు 99497 71639 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పంటపొలాలకు నీరందించండి



వంతెనపై బైఠాయించిన నాయకులు, రైతులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): పంటపొలాలకు సాగు నీరు విడుదల చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లంతకుంట మండలం వంతడుపుల వంతెనపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ ప్రాజెక్టులోకి తక్షణమే నీరు వదిలి రైతులను ఆదుకోవాలని కోరారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ స్పందించి నీటి విడుదలపై చొరవచూపాలని కోరారు. తిప్పారపు శ్రవణ్, వజ్జెపల్లి శ్రీకాంత్, దేశెట్టి శ్రీనివాస్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌లు పూర్తయ్యేదెప్పుడో?

- మానేరువాగుపై పది చెక్‌డ్యామ్‌లు.. పూర్తయింది మూడే
- మూలవాగుపై ఆరు.. పూర్తయింది ఒక్కటే
- నిధులు లేక అర్ధంతరంగా నిలిచిన పనులు
- నాణ్యతలోపంతో తెగిపోయిన చెక్‌డ్యామ్‌లు
- నీరు లేక రైతుల ఆందోళన



పనులు పూర్తికాని నిజామాబాద్ చెక్‌డ్యామ్

కోనరావుపేట(వేములవాడ)/గంభీరావుపేట (సిరిసిల్ల): జిల్లాలో భూగర్భజలాల పెంపు కోసం నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌లు సకాలంలో పూర్తి కావడం లేదు. మూలవాగు, మానేరువాగులకు జీవకళ తెచ్చేందుకు 16 చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే చెక్‌డ్యామ్‌ల నిర్మాణాల్లో జాప్యం, నిర్మించిన వాటిలో నాణత్యలేకపోవడంతో కొన్నిచోట్ల వరదకు తెగిపోయాయి. నిధులు వృథా కావడంతోపాటు రైతులకు ఉపయోగం లేకుండా పోతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

6 చెక్‌డ్యామ్‌లు.. రూ.26.21 కోట్లు

కోనరావుపేట మండలంలోని మూలవాగుపై ఆరు చెక్‌డ్యామ్‌లు నిర్మించేందుకు రూ.26.21కోట్లు మంజూరయ్యాయి. వీటిలో మరిమడ్ల మూలవాగుపై నిర్మించే చెక్‌డ్యామ్‌కు రూ.2.46 కోట్లు, నిమ్మపల్లి చెక్‌డ్యామ్‌కు రూ.3.72కోట్లు, కొండాపూర్ చెక్‌డ్యామ్‌కు రూ.3.43 కోట్లు, వెంకట్రావుపేటకు రూ.5.44కోట్లు, నిజామాబాద్‌కు రూ.3.39కోట్లు, మామిడిపల్లి మూలవాగుపై నిర్మించే చెక్‌డ్యామ్‌కు రూ.7.75 కోట్ల చొప్పున మంజూరయ్యాయి.

అసలే ఆలస్యం.. ఆపై నాణ్యతాలోపం

మూలవాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. చేసిన పనుల్లోనూ నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయి. మామిడిపల్లి, వెంట్రావుపేటల్లో జరుగుతున్న పనులు సగం కూడా పూర్తికాకముందే నిలిచిపోయాయి. మరిమడ్ల, నిమ్మపల్లి, కొండాపూర్ గ్రామాల్లో 90 శాతం పనులు జరిగాయని కాగితాల్లో చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం భిన్నంగా ఉంది. నిజామాబాద్‌లో 100 శాతం పనులు జరిగాయని ప్రకటించినా పనులు మాత్రం అలాగే ఉన్నాయి.

నర్మాల ఎగువ మానేరు నుంచి..

గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరు వరకు మానేరు వాగుపై ఇరిగేషన్‌శాఖ 10 చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారు. పనులు ఏళ్లతరబడి సా.. గుతూనే ఉన్నాయి. మూడు చెక్‌డ్యామ్‌లను మాత్రమే పూర్తి చేశారు. గంభీరావుపేట మండలం నర్మాల, ఓల్డ్ ఎల్లమ్మ టెంపుల్ దగ్గర, ఎల్లారెడ్డిపేట మండలం సింగారం వద్ద చెక్‌డ్యామ్‌లు పూర్తయ్యాయి. మిగతా వాటి పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రైతులకు తీరని నష్టం

ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌ల కారణంగా రైతులు నష్టపోతున్నారు. పనులు సక్రమంగా చేయకపోవడంతో గతేడాది కురిసిన భారీ వర్షాలకు మూలవాగు ఉప్పొంగి ప్రవహించడంతో పక్కనే ఉన్న రైతుల పొలాలు కోతకు గురయ్యాయి. మరికొందరి పొలాల్లో ఇసుకమేటలు వేసింది. చెక్‌డ్యామ్‌లకు రాతికట్టడాలతో సైడ్‌వాల్ నిర్మించకపోవడంతో వరద పొలాల్లోకి వచ్చి నష్టం ఎక్కువ అయింది.

కోతకు గురై..

గంభీరావుపేట మండల కేంద్రంలో మంచినీళ్ల బావి వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. ఈ పనులు నాసిరకంగా, ఇష్టారాజ్యంగా చేపట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. సరైన విధంగా నిర్మించకపోవడంతో చెక్‌డ్యాం గోడకు ఆనుకొని నీరంతా కోతకు గురై కిందకు ప్రవహిస్తోంది. దీంతో చెక్‌డ్యామ్ గోడ కూలిపోయే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. పనులను అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిన చేపట్టారని విమర్శిస్తున్నారు.



మరిమడ్లలో పనులు పూర్తికాకుండా వదిలేసిన చెక్‌డ్యామ్



గంభీరావుపేట మండలకేంద్రంలో మానేరువాగుపై అసంపూర్తిగా చెక్‌డ్యాం

పనులు సరిగ్గా చేయలేదు



మూలవాగుపై నిర్మించిన చెక్‌డ్యా మ్ పనులు పూర్తిగా చేయలే దు. మరిమడ్లలో నిర్మించిన చెక్‌డ్యామ్ బాడీవాల్ పగుళ్లు ఏ ర్పడింది. ఈ పనులు పూర్తయితే మూలవాగులో నీరు నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయి. చెక్‌డ్యామ్‌ల నిర్మా ణం పూర్తికాకపోవడంతో అధిక వర్షాలకు రైతుల పొలాలు కోతకు గురయ్యాయి. బాధిత రైతులకు ఇప్పటి వరకు నష్టపరి హారం అందించలేదు

– కొండం దేవనర్సు, మరిమడ్ల

పూర్తి చేయిస్తాం

కోనరావుపేట మండలంలోని నిర్మిస్తున్న 6 చెక్‌డ్యాముల్లో నాలుగింటి పనులు మేము రాకముందే పూర్తయినట్లు ప్రకటించారు. అధిక వర్షాలు, వరదలతో రైతులు నష్టపోయారు. వెంకట్రావుపేట, మామిడిపల్లి చెక్‌డ్యామ్ పనులు పూర్తికాలేదు. వర్షాకాలంలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, డీఈ, నీటిపారుదల శాఖ

పూర్తి కాలేదు



చెక్‌డ్యామ్ పనులు ఇంకా పూర్తికాలేదు. బిల్లులు అందక జాప్యమవుతుంది. చెక్‌డ్యామ్ వద్ద నేల కోతకు గురై నీరంతా కిందకు వెళ్తున్న విషయం మా దృష్టికొచ్చింది. త్వరలోనే కాంట్రాక్టర్‌ను పిలిపించి పనులు చేయిస్తాం.

– అమరేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ

వినతులు.. నిరసనలు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్

- ప్రజావాణికి తరలొచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు
- సమస్యల పరిష్కారంపై అధికారులకు సూచనలు

సిరిసిల్లటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి బాధితులు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. వివిధ సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయంటూ కొందరు.. పలువురు అధికారుల తీరుపై చర్యలు తీసుకోవాలంటూ మరికొందరు ఫిర్యాదులు అందజేశారు.

సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణికి వచ్చే అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదని, ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను శాఖల వారీగా అధికారులకు సూచిస్తూ సత్వరమే పరిష్కరించాలన్నారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకుంటే ఎందుకు కాలేదో అర్జీదారుకు లిఖితపూర్వకంగా అందివ్వాలన్నారు. తనకు పింఛన్ ఇవ్వాలని కోరుతూ సిరిసిల్ల బీవైనగర్‌కు చెందిన దివ్యాంగుడు కస్తూరి పోశెట్టి ప్రజావాణికి రాగా, కలెక్టర్ అతడి వద్దకు వెళ్లి స్వయంగా దరఖాస్తు స్వీకరించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజావాణికి 37 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 41 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 20, సర్వే శాఖ 3, డీఎంహెచ్‌వో, సిరిసిల్ల మున్సిపల్, డీపీవో ఆఫీసులకు 2 చొప్పున, డీసీఎస్‌వో, డీఆర్‌డీవో, తంగళ్లపల్లి ఎంపీడీవో, ఎస్పీ, ఏరియా ఆస్పత్రి, ఉపాధి కల్పన, విద్యాశాఖ, మిషన్ భగీరథ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చాయి. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఆనంద కుమార్, మధుసూదన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముంపు పరిహారం చెల్లించాలి



చీకోడు గ్రామస్తులు

ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామ శివారులోని చింతలచెరువులో మల్లన్నసాగర్ నుంచి నీరు తరలించి నింపడంతో తమ పొలాలు మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తరతరా లుగా సాగుతో ఉపాధి పొందుతున్న తమకు ప్రభుత్వం నష్టపరిహారం అందించడంలో అధికా రులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. త మకు పరిహారం వెంటనే చెల్లించాలని రైతులు కొంపెల్లి శ్రీనివాస్, విష్ణుమూర్తి తదితరులు కో రారు.

విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్‌కు వచ్చిన నర్సులు

ఏరియా ఆస్పత్రిలో రెగ్యులర్ స్టాఫ్ నర్సుల నియామకంతో తమను విధుల్లోంచి తొలగించారని బాధిత నర్సులు తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన తమను తొలగించడంతో కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. గతంలో తమ సేవలను గుర్తించి అవకాశం ఉన్న చోట ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధుల్లో చేర్పించాలని కోరారు. జె. తిరుమల, జ్యోతి, దీపిక, శ్రీలత తదితరులున్నారు.

శ్మశానవాటిక స్థలం కాపాడాలి



కలెక్టరేట్ వద్ద భూపతినగర్ వాసులు

కోట్లాది రూపాయలు వస్తాయన్న ఆశతో ఓ రియల్టర్ శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నారని సిరిసిల్లలోని భూపతినగర్ వాసులు ఆందోళన చేపట్టారు. స్థానిక బడా వ్యాపారి కొద్దిరోజులుగా గ్రేయార్డు స్థలాన్ని ప్లాట్లుగా తయారు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ తాతల కాలం నుంచి సదరు స్థలంలో శ్మశానవాటిక ఉందని పేర్కొన్నారు. రియల్ వ్యాపారి చేస్తున్న అక్రమాన్ని అడ్డుకోవాలని కలెక్టర్‌ను స్థానిక కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, సుదర్శన్, సాయి, మధు, శ్రీహరి తదితరులు కోరారు.

అవినీతిని నిరోధించాలి



కలెక్టర్ ఆఫీస్ వద్ద బీజేపీ నిరసన

సిరిసిల్ల ము న్సిపల్ అధి కారులు, ప్రజా ప్రతినిధుల పెత్తనంతో అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆరోపించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా ఎమ్మెల్యే కేటీఆర్ అండతో టౌన్ ప్లానింగ్ అధికారి ఏకధాటిగా విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్ తదితర ప్రజాప్రతినిధుల అండతో అనేక అవినీతి జరుగుతుందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. గోపాల్‌నగర్‌లోని వైస్‌చైర్మన్ భవనం నిబంధనలకు విరుద్ధంగా ఉందని, మూడేళ్ల క్రితమే నోటీసులు ఇచ్చి కూడా చర్యలు చేపట్టడం లేదన్నారు.

న్యాయం చేయాలి

కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్మాణంలో భూమి కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. వేములవాడ మండలం నాంపెల్లి, అయ్యోరుపల్లి, శాత్రాజుపల్లి, అనుపురం, కొడుముంజ గ్రామాల పేదప్రజల భూముల్లోంచి రైల్వే లైన్ పోతుందన్నారు. ఆ భూములే తమకు జీవనాధారమని, అలైన్‌మెంట్ మార్చాలని లేకుంటే గుంటకు రూ.20లక్షలు చెల్లించాలని బాధితులు వేణుగోపాల్, శంకర్ తదితరులు కోరారు.



వేములవాడ రైల్వేలైన్ బాధితులు

ఇద్దరు ఎంపీలు ఏం చేశారో చెప్పాలి?

- మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బోయినపల్లి(చొప్పదండి): కరీంనగర్‌కు ఎంపీగా బండి సంజయ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఏం చేశారో చర్చకు రావాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి బస్టాండ్ ప్రాంతంలో ఛత్రపతి శివాజీ, గాంధీ విగ్రహాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇద్దరు ఎంపీల పదేళ్ల పనితనంపై, ఎంపీగా తన ఐదేళ్ల పనితనంపై చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. కోరలు ఉన్నవారి కోరలు పీకామని, ఇప్పుడు గ్రామాల్లో స్వేచ్ఛ ఉందని, సీఎంతో, తమతో మాట్లాడే అవకాశం ఉందన్నారు. మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టో ఇచ్చిందని, దాన్ని అమలు చేయడం తమబాధ్యత అన్నారు. ఈ విషయంలో సీఎంతో మాట్లాడినట్లు వివరించారు. సమ్మక్క, సారక్క జాతరతో గ్రామాల్లో కొంత బస్సుల కొరత ఉందని, ప్రజలు జాతర అయిపోయే వరకు సంయమనం పాటించాలన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు, త్వరలో గృహజ్యోతి, రూ.500 సిలిండర్ పథకం అమలు అవుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సీఎంతో చర్చించినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇస్తామన్న హామీ, నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల పథకం వర్తింపజేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మాజీ సర్పంచు కూస పద్మ, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో బీమా జయశీల, నాయకులు వన్నెల రమణారెడ్డి, బొలుమాల శంకర్, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న జూకంటి జగన్నాథం

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లఎడ్యుకేషన్: భాషలో సృజనాత్మకతనే కవిత్వంగా వర్ధిల్లుతుందని, విద్యార్థి దశలోనే సాహిత్యాసక్తి పెంచుకోవాలని ప్రముఖ కవి జూకంటి జగన్నాథం అన్నారు. సోమవారం కుసుమ రామయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కవిత, కథ, పాట రచనలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి తరం పిల్లల్లో సామాజిక స్పృహ లోపించిందని, సాహిత్యాభిరుచితో పెంచే అవకాశం ఉందన్నారు. అనంతరం కథా రచనపై గరిపెల్లి అశోక్, కవిత్వంపై బూర్ల వెంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, పాటలపై వెంగలి నాగరాజు మెలకువల్ని నేర్పించారు. తెలంగాణ రచయితల వేదిక కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, పాకాల శంకర్‌గౌడ్, హెచ్‌ఎం మోతీలాల్, ఉపాధ్యాయులు మల్లారపు పురుషోత్తం, సమ్మయ్య, శ్రీనివాసరెడ్డి, రజిత పాల్గొన్నారు.



శోభాయాత్రలో బజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాములు తదితరులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: అఖండ హిందూ సామ్రాజ్య వ్యవస్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని వైశ్య భవన్ నుంచి యాత్ర ప్రారంభమై ప్రధాన వీధుల గుండా సాగింది. ప్రత్యేకంగా రూపొందించిన వాహనంపై శివాజీ విగ్రహానికి ముఖ్య అతిథి, బజరంగ్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాములు పూలమాల వేసి శోభాయాత్ర ప్రారంభించారు. కాషాయ ధ్వజాలు, జై శ్రీరామ్ నినాదాలు, జైభవానీ.. వీర శివాజీ నినాదాలతో కార్యకర్తలు హోరెత్తించారు. బీజేపీ సీనియర్ నేతలు ఆడెపు రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్ గూడూరి భాస్కర్, పట్టణాధ్యక్షుడు మోర శ్రీనివాస్, గాజుల వేణు, వీహెచ్‌పీ, ఏబీవీపీ ప్రతినిధులు చేపూరి అశోక్, గుంటుక పురుషోత్తం, బుర్ర లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు

'పల్స్ పోలియో' అందరి బాధ్యత

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్ల: పల్స్ పోలియో చుక్కలు వేయించడం అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సోమవారం సమీక్షించారు. మార్చి 3 నుంచి 5వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వంద శాతం విజయవంతం చేయాలన్నారు. అందరికీ తెలిసేలా పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రచారం చేయాలని సూచించారు. ప్రతీ స్కూల్ ప్రార్థన సమయంలో, మున్సిపల్, గ్రామ పంచాయతీ చెత్త సేకరించే సమయంలో వాహనాలపై ప్రచారం చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాల సిబ్బందికి, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. బస్టాండ్, మార్కెట్, ఇతర రద్దీ ప్రాంతాల్లో పోస్టర్లు, బ్యానర్లు పెట్టేందుకు, పల్స్ పోలియో చుక్కలు వేసే రోజుల్లో వైద్య సిబ్బందికి టోపీలు, ఆహార పదార్థాలు ఇచ్చేందుకు రోటరీ, లయన్స్ క్లబ్ బాధ్యులు సహకరించాలని కోరారు. ఇటుక బట్టీలు, ఇతర పనులు చేసే కూలీల పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఐదేళ్లలోపు వయసు ఉన్న పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత మాట్లాడుతూ, జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 44,770 మంది ఉన్నారని, జిల్లాలో మొత్తం 394 కేంద్రాలు ఏర్పాటు చేసి, పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, డీపీవో వీరబుచ్చయ్య, ప్రోగ్రాం అధికారి డా.నయీమా, సీడీపీవోలు ఎల్లయ్య, అలేఖ్య, మున్సిపల్ ఈఈ ప్రసాద్, జీసీడీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రామా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



కరీంనగర్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి డ్రామా పోటీల్లో రామడుగు మండలం రుద్రారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జెండర్ డిస్క్రిమినేషన్ అనే డ్రామా అంశంలో పాల్గొని సత్తాచాటిన గోనే వైష్ణవి (9వ తరగతి), పల్లి ప్రణయ, పింగిలి అనన్య, వెలుమల సహస్ర, కొక్కుల శివమణి (8వ తరగతి)లను గైడ్ టీచర్ శ్రావణ్‌కుమార్, డైట్ ప్రిన్సిపాల్ పి.మొండయ్య, వినయధర్ రాజు, సీహెచ్ ప్రద్యుమ్నకుమార్, జి.శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీపీ రంగనాథశర్మ అభినందించారు.

కల్వర్టు వద్ద లారీ బోల్తా



మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. మధ్యప్రదేశ్ నుంచి గోధుమల లోడ్‌తో వరంగల్ వైపు వెళ్తున్న లారీ మేడిపల్లి - వెంకట్రావుపేట మధ్య కల్వర్టు వద్ద ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏవరికీ ఏమీ కాలేదు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో రెండుప్రమాదాలు చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రాయికల్:రాయికల్ మండలం రామాజీపేటలో అక్రమంగా నిలువ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ య్యాన్ని పట్టుకున్నట్లు జగిత్యాల, మల్యాల సివిల్ సప్లై డీటీలు వరప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. రామాజీపేటలో బియ్యం నిలువ చేశారనే పక్కా సమాచారంతో దాడులు చేశామని, ఇందులో 12 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని వారు తెలిపారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య పాల్గొన్నారు.

మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం



చంద్రారెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన నేవూరి చంద్రారెడ్డి(70) సోమవారం ఉదయం అదృశ్యమయ్యాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. పోలీసుల వివరాలు.. చంద్రారెడ్డి ఏడాదిగా మతిస్థిమితం సరిగా లేకుండా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి భార్య లక్ష్మి, కుమారులు ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కూతురు వెంకటవ్వ ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రైతే 'మార్కెట్'కు రాజు

- మార్కెట్ కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా వారే నియామకం
- మార్గదర్శకాలు వెలువరించిన ప్రభుత్వం
- పదవీకాలం మూడేళ్లు
- జిల్లాలో 7 మార్కెట్లు



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

కరీంనగర్ అర్బన్: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఇక రైతులే పాలకులుగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను వెలువరించగా.. వాటి ప్రకారం కొత్త కమిటీలు ఏర్పాటు కానున్నాయి. వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే నూతన పాలకవర్గాలను ఏర్పాటు చేస్తామని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. గతంలో ఏడాది ఉండే పాలకవర్గ పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచారు. తాజాగా ఆరేసి నెలలు రెండుసార్లు పెంచాలని నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు వచ్చే పాలకవర్గాల పదవీ కాలం మూడేళ్ల వరకు ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన పలువురు పదవుల కోసం ఇప్పటికే పైరవీలు మొదలుపెట్టారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, గంగాధర, గోపాల్‌రావుపేట, చొప్పదండి, మానకొండూరు, హుజూరాబాద్ మార్కెట్లుండగా రిజర్వేషన్ విధానంలో పాలకవర్గాలను ప్రకటించనున్నారు.

18 మంది సభ్యులతో కమిటీ

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాల మార్కెట్ల చట్టం–1966 సెక్షన్–5(1), ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం ప్రతీ మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన మార్కెట్ కమిటీ ఏర్పాటవుతుంది. దీని పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు ఉంటారు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక(మైనార్టీ) వర్గాలు, మహిళలై ఉండాలి. అలాగే కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నలుగురు ఉండనున్నారు. మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, జిల్లా వ్యవసాయ/ఉద్యాన/పశుసంవర్ధక/మత్స్యశాఖ అధికారుల్లో ఒకరు, మార్కెట్ కమిటీ పరిధిలోని మేయర్/మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు సభ్యులుగా ఉండనున్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్ నియామకం ఇలా..

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్‌ను లైసెన్స్ ట్రేడర్స్ సభ్యుల నుంచి లేదా రైతు సభ్యుల నుంచి నియమించవచ్చు.

మార్కెట్లఆదాయాన్ని బట్టి గ్రేడింగ్

మార్కెట్‌ల ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్ విధానం కొనసాగుతోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా పంటల కొనుగోలు పరంగా పన్నుతో ఆదాయం లభిస్తుంది. ఆయా మార్కెట్ల ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం గ్రేడ్ ఇస్తుంది. రూ.3 కోట్లకు పైగా ఆదాయం ఉంటే దాన్ని సెలక్షన్ గ్రేడ్‌గా పరిగణిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటే స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తూ ఏడీ క్యాడర్ అధికారిని నియమిస్తారు. రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే గ్రేడ్–1గా, రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే గ్రేడ్–2గా, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటే గ్రేడ్–3గా పరిగణిస్తూ ఆయా గ్రేడ్ స్థాయిని బట్టి అధికారులను, రూ.25 లక్షల వరకు ఆదాయం లభిస్తే దానికి అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి అధికారిని నియమిస్తారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట మార్కెట్లు సెలక్షన్ గ్రేడ్ కాగా, చొప్పదండి స్పెషల్ గ్రేడ్, హుజూరాబాద్ గ్రేడ్–1, గంగాధర గ్రేడ్–3, మానకొండూరు, గోపాల్‌రావుపేట వేటి పరిధిలోకీ రావు.

రిజర్వేషన్లతో చైర్మన్ పదవులు

రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్ పదవులు వరించనున్నాయి. ఆయా మార్కెట్లకు ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం చైర్మన్లను నియమించనున్నారు. కరీంనగర్ మార్కెట్ పాలకవర్గానికి బీసీ, జమ్మికుంట–ఎస్సీ మహిళా, మానకొండూరు–ఎస్టీ, గంగాధర–జనరల్ మహిళా, గోపాల్‌రావుపేట–జనరల్ మహిళా, చొప్పదండి–ఎస్సీ, హుజూరాబాద్– జనరల్ మహిళాకు కేటాయించారు.

ఆరిపోయిన 'దియా'

- లారీ ఢీకొని డిగ్రీ విద్యార్థిని దుర్మరణం
- బొమ్మకల్ ఫ్లైఓవర్ సర్కిల్‌లో ఘటన



దియాపటేల్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: లారీ ఢీకొని ఓ విద్యార్థిని దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన వాసాని జగదీశ్ కొన్నేళ్ల క్రితం భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ వచ్చి, ఇక్కడే ఉంటున్నాడు. స్థానికంగా కట్టెకోత మెషీన్ పని చేస్తున్నాడు. ఆయన పెద్ద కూతురు దియాపటేల్(19) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం 8 గంటలకు ఎలక్ట్రికల్ స్కూటీపై కాలేజీకి వెళ్తోంది. బొమ్మకల్ ఫ్లైఓవర్ సర్కిల్‌లో గోదావరిఖని నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 14 టైర్ల లారీ వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దియాపటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గంటకే మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ఎంసీహెచ్‌లో శిశువు అపహరణ నిర్లక్ష్యం వల్లే జరిగిందని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి బ్రామండ్లపల్లి యుగంధర్, అధ్యక్షుడు బోనగిరి మహేందర్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. గతంలోనూ శిశువుల మిస్సింగ్ ఘటనలు చోటుచేసుకున్నాయని, అయినా సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదన్నారు. తాజా సంఘటనకు డ్యూటీలో ఉన్న సెక్యూరిటీ గార్డు, జీఎన్ఎం, ఏఎన్ఎం, వైద్యులు, అధికారులను బాధ్యులను చేస్తూ వారిని సస్పెండ్ చేయాలని విన్నవించారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఔట్‌పోస్టు లేదని, ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీపైనే ఆధారపడటంతో భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చెంచల మురళి, నాయకులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ ప్రచారాన్ని నమ్మొద్దు



మాట్లాడుతున్న భీంరెడ్డి, నాయకులు

విద్యానగర్(కరీంనగర్): పౌల్ట్రీ పరిశ్రమను దెబ్బతీసే కుట్రలో భాగంగా బ్రాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ వచ్చిందని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలు దీన్ని నమ్మవద్దని నేషనల్ ఎగ్ కో–ఆర్డినేషన్ కమిటీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.భీంరెడ్డి, బ్రాయిలర్ రైతుల సంక్షేమ సంఘం సభ్యుడు డి.జనార్దన్ రెడ్డి కోరారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమ్మక్క జాతర నేపథ్యంలో చికెన్, కోడిగుడ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని దళారులు లాభాలు పొందేందుకు వదంతులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రతినిధులు ఎం.ఖదీర్, పాదం రాజు, సంకిటి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నర్సింహులు పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్నిక



అనూప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జిల్లా కార్యదర్శి, అంతర్జాతీయ రేటెడ్ క్రీడాకారుడు కంకటి అనూప్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనూప్ కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆయనను తెలంగాణ రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాక్షులు తుమ్మల రమేశ్ రెడ్డి, కరీం, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ.యూనిస్ పాషా, జూడో సంఘం రాష్ట్ర సభ్యులు మహేందర్, సురేందర్ సింగ్, వికాస్, గౌతమ్, సందీప్ తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ వరంగల్, రంగారెడ్డి



పురుషుల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన వరంగల్ జిల్లా జట్టు



మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలిచిన రంగారెడ్డి జట్టు





తృతీయ స్థానంలో నిలిచిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పురుషుల, మహిళల జట్లు

- ద్వితీయస్థానాల్లో హైదరాబాద్, వరంగల్
- ఉమ్మడి కరీంనగర్ జట్లకు తృతీయ స్థానం
- ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: 52వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పురుషుల చాంపియన్‌గా వరంగల్ జట్టు, మహిళా చాంపియన్‌గా రంగారెడ్డి జిల్లా జట్లు నిలిచాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానం సాధించగా మహిళల విభాగంలో వరంగల్ ద్వితీయ, కరీంనగర్ తృతీయ స్థానాలు సాధించాయి. కరీంనగర్‌లోని లయోలా జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్‌లు హాజరై విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు ఇటీవల వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్లకు ఎంపిక చేశామన్నారు. పోటీల పరిశీలకుడు దీపక్ ప్రసాద్, కరీంనగర్ జిల్లా యువజన క్రీడాధికారి శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రభాకర్, వెంకటేశ్, నర్సయ్య తదితరులున్నారు.

మహిమగల పుణ్యక్షేత్రం ఎములాడ



సుమన్‌ను సత్కరిస్తున్న ఏఈవో శ్రీనివాస్

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం అత్యంత మహిమగల పుణ్యక్షేత్రమని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని సోమవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడారు. రాజన్న క్షేత్రం అత్యంత మహిమ కలిగిన దేవుడని, అందుకే నిత్యం వేలాది మంది భక్తులు ఆయన దర్శనం కోసం వస్తున్నారని తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాను రాజన్నకు మొక్కుకున్నానని వివరించారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ఏఈవో శ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు తదితరులు సుమన్‌ను సత్కరించారు.

ఏపీఏ మైన్‌కు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న గని మేనేజర్ తిరుపతి

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ అడ్రియాల ప్రాజెక్టు ఏరియా గనికి 2023–24 సంవత్సరానికి గాను 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ కోల్ విభాగంలో జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు, అడిషనల్ మేనేజర్ శ్రీకాంత్ 'డీప్ అండర్ గ్రౌండ్ కోల్ మైనింగ్'లో సమర్థత, భద్రతను పెంచడం, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కూలింగ్, ట్యూబ్ బండిల్ గ్యాస్ మానిటరింగ్ సిస్టంలతో కూడిన కేస్ స్టడీని సమర్పించారు. దాని ఆధారంగా 'బెస్ట్ టెక్నాలజీ మైన్ ఇన్ అండర్ గ్రౌండ్ కోల్' 2023–2024 కేటగిరీలో అవార్డు దక్కింది. భువనేశ్వర్‌లో జరిగిన సదస్సులో గని మేనేజర్ ములుకుంట్ల తిరుపతి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పికప్ వాహనాన్ని సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్ హౌస్ అధికారి శ్రీనివాస్‌రావు వివరాల ప్రకారం.. మండంలోని రాచర్లగొల్లపల్లికి చెందిన గాంతుల సత్తయ్య తన పికప్ వాహనంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నారాయణపూర్ మానేరువాగు నుంచి ఇసుకను కామారెడ్డి జిల్లా కేంద్రంలో అమ్మడానికి తరలిస్తుండగా గొల్లపల్లిలో పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



సీటు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

బస్సుల కొరత.. ఇబ్బందుల తీవ్రత



ఫుట్‌బోర్డు ప్రయాణం



కామారెడ్డి బస్సులో కిక్కిరిసిన జనం

సమయానికి బస్సులు రాక సోమవారం సిరిసిల్ల బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మేడారం జాతరకు సిరిసిల్ల డిపో నుంచి 32 బస్సులు పంపించారు. డిపోలో మొత్తం 61 బస్సులు ఉండగా అందులో సగం జాతరకు పంపడంతో బస్సుల కొరత ఏర్పడి, సమయానికి రాక ప్రయాణికులు చాలాసేపు నిరీక్షించారు. తీరా బస్సులు బస్టాండ్‌కు రావడంతో సీట్లకోసం ఎగబడ్డారు. నిల్చోడానికి చోటు లేక చివరికి ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేశారు. అసలే పెళ్లిల్ల సీజన్ కావడంతో జనంతో బస్టాండ్ కిక్కిరిసింది. చాలా సేపు బస్సులకోసం వేచి చూసి గత్యంతరం లేక సమయానికి ఇంటికి చేరుకునేందుకు ఆటోలను ఆశ్రయించారు. ఇదే అదనుగా భావించిన ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేశారు. ఇదేం గోసరో నాయనా అంటూ జనం ప్రయాణం సాగించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

యువతి అదృశ్యం

కరీంనగర్‌క్రైం: ఎల్లారెడ్డిపేట మండలం అక్కన్నపేటకు చెందిన ఎ.సుజాత (22) యువతి ఈనెల 17న కరీంనగర్‌లో అదృశ్యమైనట్లు సోమవారం ఆమె కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుజాత ఈనెల 17న కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న తన బంధువును చూసేందుకు వచ్చింది. ఆదే రోజు ఆమె సర్టిఫికెట్ల పనిమీద హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పడంతో వారి సమీప బంధువు ఒకరు బైక్‌పై బస్టాండ్‌లో దించాడు. అప్పటి నుంచి ఆమె ఫోన్ పనిచేయకపోవడంతో ఆచూకీ కోసం హైదరాబాద్‌లోని స్నేహితుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె తాత వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం ఓగులాపూర్‌కు చెందిన వృద్ధుడు బోయిని మల్లయ్య (65) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై బండి రాజేశ్ తెలిపిన వివరాలు... ఓగులాపూర్‌కు చెందిన మల్లయ్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చాలా ఆసుపత్రిల్లో చికిత్స చేయించిన నయం కాలేదు. దీంతో మానసికంగా వేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తితో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొడుకు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ఇలవేల్పుకు నీరాజనం

వేములవాడ: వేములవాడ రాజన్నను సోమవారం 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో తమ ఇలవేల్పుకు మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. క్యూలైన్లు ఎక్కడికక్కడ నిండిపోయాయి. భక్తుల ద్వారా రూ.45 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.





